సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం । 3 । జూన్ । 2024



పోస్టింగ్‌లు ఎప్పుడో?
గురుకుల ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు.
వివరాలు 8లో ▸



ముఠా గుట్టు రట్టు
రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 41.5 /27.1
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాలమూరులో మోస్తరు వర్షం
మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, గాలి దుమారంతోపాటు మోస్తరు వర్షం కురిసింది. కాగా, ఉదయం నుంచి ఎండ వేడిమితో ఉక్కపోతకు గురైన పట్టణ ప్రజలు ఒక్కసారిగా వాతావరణ చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్
జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు ఎన్నికల సాధారణ పరిశీలకుడు షెవాంగ్ గ్యాచో భూటియా తెలిపారు. ఆదివారం కలెక్టర్ రవినాయక్‌తో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్‌కు సిబ్బందిని అసెంబ్లీల సెగ్మెంట్‌లకు కేటాయించినట్లు వివరించారు. రెండో ర్యాండమైజేషన్ నిర్వహించి 20 శాతం రిజర్వ్ కలిపి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, సూక్ష్మ పరిశీలకులను కేటాయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఎన్‌ఐసీ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పనిచేస్తా


అడ్డాకుల: కలెక్టర్ కావాలన్న తన కోరిక నెరవేరినందుకు ఆనందంగా ఉందని.. కలెక్టర్‌గా పేదల కోసం పనిచేస్తానని సివిల్స్ మూడో ర్యాంకర్ దోనూరు అనన్యరెడ్డి అన్నారు. ఆమె స్వగ్రామమైన పొన్నకల్‌లో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అనన్యరెడ్డి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తానని తెలిపారు. పేదల బాగుకు నిరంతరం శ్రమిస్తానన్నారు. ఎంపీపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. సివిల్స్‌లో అనన్యరెడ్డి మూడో ర్యాంకు సాధించి, పొన్నకల్‌కు జాతీయ స్థాయిలో పేరు తీసుకొచ్చారని కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు ఆమెతో పాటు తల్లిదండ్రులు మంజుల, సురేష్‌రెడ్డిలను శాలువాలతో సత్కరించారు.



స్ట్రాంగ్‌రూం తాళాలు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి రవినాయక్, వివిధ పార్టీల ప్రతినిధులు



నవీన్‌కుమార్‌రెడ్డిని ఎత్తుకొని ఊరేగింపుగా వస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

స్థానికం.. బీఆర్‌ఎస్‌దే

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటు నిలబెట్టుకున్న గులాబీ పార్టీ

- మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం
- గంట వ్యవధిలోనే కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయిన మన్నె జీవన్‌రెడ్డి
- మొదట్లో ఉత్కంఠ రేపినా.. రెండు గంటల్లోనే తేలిన ఫలితం
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం

పాలమూరు: సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో అధికార కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్ తగిలింది. మొదటి నుంచి గెలుపుపై భారీ ధీమాగా ఉన్న ఆ పార్టీకి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనసభ ఉపఎన్నిక ఫలితం వ్యతిరేకంగా వచ్చింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి 109 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిపై విజయం సాధించారు. మార్చి 28న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించారు. ఏప్రిల్ 2న కౌంటింగ్ జరగాల్సి ఉండగా.. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాయిదా పడ్డాయి. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఫలితం వచ్చేసింది. మొదట బ్యాలెట్ బాక్సుల నుంచి ఓట్లు తీసి అభ్యర్థులకు వచ్చిన గుర్తుల ఆధారంగా వేర్వేరుగా కట్టలు కట్టారు. ఆ తర్వాత లెక్కింపు ప్రక్రియలో చెల్లుబాటు అయిన ఓట్లు, చెల్లుబాటు కానీ ఓట్లను లెక్కించి.. చెల్లుబాటు అయిన ఓట్ల నుంచి గెలుపు కోటాను నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలోనే ఆధిక్యం చూపిన నవీన్‌కుమార్‌రెడ్డి 109 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నవీన్‌కు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

పటిష్ట భద్రత..
ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలతో పాటు ఆవరణలో భారీ పోలీస్ భద్రత కల్పించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కంటే ముందే ఉద్యోగులు,

మొత్తం ఓట్లు 1,439	ఓటేసిన వారు 1,437
తిరస్కరించిన ఓట్లు 21	చెల్లుబాటు అయిన ఓట్లు 1,416
గెలుపు కోసం కావాల్సిన ఓట్లు	709 (50శాతం)
బీఆర్‌ఎస్ అభ్యర్థికి వచ్చినవి 762	కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చినవి 653
స్వతంత్ర అభ్యర్థికి వచ్చినవి 1	గెలిచిన అభ్యర్థికి వచ్చిన మెజార్టీ 109

జరుగుతున్న భవనాన్ని కేంద్ర బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా పోలీస్‌శాఖ పటిష్ట భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం దగ్గర పోలీసులను భారీగా మోహరించారు. ఏఎస్పీ రాములు, మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. 264 మంది పోలీస్ సిబ్బంది భద్రతా విధులు నిర్వర్తించారు. లెక్కింపు ముగింపు తర్వాత అభ్యర్థులు బయటకు వస్తున్న సమయంలో గేట్ దగ్గరకు ఒక్కసారిగా కార్యకర్తలు భారీగా చేరుకోవడంతో పోలీసులు అదుపు చేశారు.



నవీన్‌కుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీగా ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రవినాయక్
చిత్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

కార్యకర్తల్లో ఉత్సాహం..
ఎన్నికల ఫలితాలకు సంబంధించి పూర్తి అవుతున్న సమయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో కౌంటింగ్ కేంద్రం దగ్గరకు చేరుకోవడంతో పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు కట్టడి చర్యలు చేపట్టారు. మొదటి నుంచి బీఆర్‌ఎస్ లీడ్‌లో ఉందనే విషయం బయటకు రావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. ఆ తర్వాత వెలువడిన ఫలితాలతో బీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రం దగ్గర నృత్యాలు చేస్తూ.. కేరింతలు కొట్టారు. పలువురు కార్యకర్తలు రోడ్డు పైకి చేరుకుని నినాదాలు చేశారు. కౌంటింగ్‌లో తుది దశకు చేరుకున్న క్రమంలో చాలామంది కార్యకర్తలు కౌంటింగ్ కేంద్రానికి చేరుకొని సంబరాలు చేసుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు.



గంట వ్యవధిలోనే బయటకు..
బ్యాలెట్ బాక్సుల్లో నుంచి ఓట్లను బయటకు తీసి లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైన గంట వ్యవధిలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు. అప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి పేరుతో ఉన్న ఓట్లు అధికంగా ఉండటంతో పరిస్థితి గమనించి మన్నె జీవన్‌రెడ్డి బయటకు వచ్చేశారు. దీంతో ఓటమి ఖరారు అయినట్లు గమనించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైతం కౌంటింగ్ కేంద్రం పరిసరాల నుంచి వెళ్లిపోవడం కనిపించింది.

ఎమ్మెల్సీ ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలను నమ్మి కేసీఆర్ తనకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇతర ఎమ్మెల్యేలు మంచి తోడ్పాటు ఇచ్చారన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు సీఎం సొంత జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనను గెలిపించడం గర్వంగా ఉందన్నారు. జిల్లా నుంచి ఈ విజయం కేసీఆర్‌కు కానుకగా అందిస్తామన్నారు. పాలమూరు జిల్లా రేవంత్‌రెడ్డి అడ్డా కాదు.. బీఆర్‌ఎస్ అడ్డా అని మరోసారి ఓటర్లు నిరూపించారన్నారు.

ఈ విజయం.. సీఎంకు చెంప పెట్టు
ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మంచి మెజార్టీతో గెలుపొందడం సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టులాంటిదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గెలుపు అమరులకు అంకితం ఇస్తున్నామన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజే లభించిన ఈ గెలుపు ఎప్పటికీ గుర్తు ఉంటుందన్నారు. తెలంగాణ ఏర్పాటు నాడు కేసీఆర్‌కు ఎమ్మెల్సీ గెలుపు కానుకగా ఇస్తున్నామన్నారు. ఈ ఫలితం ముందే తెలుసన్నారు. 1,437 ఓట్లలో బీఆర్‌ఎస్‌కు వెయ్యి వరకు ఓట్లు ఉంటే ఎన్నికల తర్వాత సుమారు 150 నుంచి 200 మంది పార్టీ మారారని చెప్పారు. అప్పటికీ బీఆర్‌ఎస్‌కే స్పష్టమైన మెజార్టీ ఉందని, కానీ.. అతి విశ్వాసంతో సీఎం రేవంత్ ఈ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెట్టి.. ఓటమిని మూటగట్టుకున్నారని దుయ్యబట్టారు. పైగా 200 ఓట్ల మెజార్టీతో గెలుస్తాం అంటూ ప్రకటించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పాలమూరు బిడ్డగా చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ఇది ఒక చేదు కానుకగా తీసుకుని.. ఇక నుంచైనా ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, చిట్టెం రాంమోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సబ్బండ వర్గాల ఆకాంక్ష తెలంగాణ



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు

- జాతీయ జెండాను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్
- సాదాసీదాగా అవతరణ వేడుకలు
- కేవలం పది నిమిషాల్లోనే కార్యక్రమం పూర్తి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సబ్బండ వర్గాల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు సాదాసీదాగా జరిగాయి. కేవలం పది నిమిషాల్లోనే కార్యక్రమం ముగించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కేవలం రెండు నిమిషాలు ప్రసంగించారు. అనేక పోరాటాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. సబ్బండ వర్గాలు కలిసి పోరాటం చేశారన్నారు. పదేళ్ల ఉత్సవాల్లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ శుభాకాంక్షలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో 72 శాతం పోలింగ్ నమోదు కావడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును అధిక సంఖ్యలో వినియోగించుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు. జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే అవుతుందన్నారు. వేడుకలు మొత్తంగా 10 నిమిషాల్లో పూర్తి చేశారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండటంతో వేడుకలను సాదాసీదాగా నిర్వహించినట్లు తెలుస్తుంది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రతిసారి ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారుల కుటుంబ సభ్యులను, ఉద్యమకారులను సన్మానించుకోవడం ఆనవాయితీ. కానీ, ఈసారి అలాంటివి ఏమి లేకుండానే ముగించారు.



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అబ్బర్వర్ వాణీప్రసాద్, కలెక్టర్ రవినాయక్

అమరులకు ఘన నివాళి
జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శి, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థ ఎమ్మెల్సీ అబ్బర్వర్ వాణీప్రసాద్, కలెక్టర్ రవినాయక్ తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



జెండా ఆవిష్కరిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

డీఐజీ కార్యాలయంలో..
మహబూబ్‌నగర్ క్రైం: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలోని డీఐజీ కార్యాలయంలో ఆదివారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరుల త్యాగాలను స్మరించుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసినట్లు వివరించారు. తెలంగాణ ఫలాలు ప్రజలకు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. జిల్లాలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, పీఆర్‌ఈఈ నరేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీహరి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



జెండాకు సెల్యూట్ చేస్తున్న చైర్‌పర్సన్ స్వర్ణమ్మ

మంచి మెజార్టీతో గెలుస్తాం: డీకే అరుణ
పాలమూరు: మహబూబ్‌నగర్ ఎంపీ సీటును మంచి మెజార్టీతో గెలుస్తున్నామని బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ధీమా వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రం సమీపంలోని జాలీహిల్స్‌లో ఆదివారం పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అసెంబ్లీల వారీగా ఫలితాలపై అంచనాలు వేస్తూ చర్చించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో జరిగిన పోలింగ్ సరళి, ఫలితాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్‌తో గెలుపుపై మరింత విశ్వాసం పెరిగిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ 10 నుంచి 12 సీట్లు గెలవబోతుందని, మరోసారి మోదీ ప్రధాని కాబోతున్నారన్నారు. దేశంలో ఎటు పోయినా మోదీ గెలుపు మాటే వినిపిస్తోందన్నారు. ఫలితాల తర్వాత క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థాయిల్లో పోటీలో ఉండేలా చూడాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సైతం బీజేపీ సైన్యం తయారు చేసుకోవాలన్నారు. ఈసారి ఎన్నికల్లో చార్ సౌ పార్ అనే నినాదం గ్రౌండ్ లెవల్‌లోకి బలంగా తీసుకువెళ్లడం జరిగిందన్నారు. మోదీ, బీజేపీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే అరుణ

గ్రామీణ విద్యకు వెలుగులు

- జిల్లా మళ్లీ తెరుచుకోనున్న మూతబడిన 48 పాఠశాలలు
- డిప్యూటేషన్లు రద్దు.. యథాస్థానాల్లోకి ఉపాధ్యాయులు
- స్థానిక గ్రామాల్లోనే త్వరలో బడిబాట కార్యక్రమాలు

గండేడ్: గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కారణాలతో మూసివేసిన బడులు మళ్లీ తెరుచుకోనున్నాయి. గతేడాది పిల్లలు లేని బడులు, ఒకరిద్దరు ఉన్న వారిని మూసి వేసి అక్కడున్న ఉపాధ్యాయులను స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో టీచర్ల కొరత ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్లు ఇచ్చారు. అయితే పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో తండాల్లో మారుమూల ప్రాంతాల్లో విద్యకు దూరం అవుతున్న కారణంగా కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూత పడ్డ పాఠశాలలను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించింది. ప్రతి పంచాయతీలో ఒక బడి తప్పనిసరిగా ఉండాలన్న సంకల్పంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే బడుల పునరుద్ధరణకు మార్గదర్శకాలు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 17 మండలాల్లో 441 పంచాయతీల్లో మొత్తం 857 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 618 ప్రాథమిక పాఠశాలలు, 90 ప్రాథమికోన్నత పాఠశాలలు, 149 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 71,685 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు.

అందుబాటులోకి 48 పాఠశాలలు..
జిల్లాలో ఆయా మండలాల్లో తిరిగి 48 ప్రాథమిక పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయి. గతేడాది వివిధ కారణాలతో వీటిని రద్దు చేశారు. గండేడ్ మండలంలో పీర్లబండతండా, గోవిందుపల్లి, జానంపల్లి, చెన్నాయిపల్లి, పరుగుల తండా, రాకాసులబండ తండా, వడ్డెగుడిసెలు, వెన్నాచేడ్ ఉర్దూ మీడియం పాఠశాలలు కలిపి 10 ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. మహమ్మదాబాద్ మండలంలో రాగరీపల్లి, బండమీదిపల్లి, శీకర్లబండతండా తదితర చోట్ల 6 ప్రాథమిక పాఠశాలలు మూసివేశారు. మిడ్జిల్– 2, జడ్చర్ల– 6, రాజాపూర్– 1, బాల్‌నగర్–10, నవాబుపేట్–2, భూత్పూర్–2, మూసాపేట్–2, మహబూబ్‌నగర్ అర్బన్–2, మహబూబ్‌నగర్ రూరల్–1, కోయిల్‌కొండ–2, సీసీ కుంట –2 చొప్పున మండలాల్లో ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. ఇవి మూతపడడంతో ప్రాథమిక విద్య చదివేందుకు ఆయా గ్రామాల్లో కష్టమైంది. ప్రస్తుతం ఇవన్నీ తెరుచుకోనున్నాయి. ప్రభుత్వం వాటి పునరుద్ధరణకు సంకల్పించడంతో గ్రామీణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

డిప్యూటేషన్లు రద్దు..
విద్యార్థులు లేని బడులు, తక్కువగా ఉన్న పాఠశాలలను మూసివేసి అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలో డిప్యూటేషన్లు ఇచ్చారు. గతేడాది వీరంతా డిప్యూటేషన్‌పై తమకు కేటాయించిన పాఠశాలల్లోనే విధులు నిర్వహించారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో మొత్తం 16 పాఠశాలలు మూతపడగా వారంతా వెన్నాచేడ్, సల్కర్‌పేట్, గండేడ్, పగిడ్యాల్, జక్లపల్లి, మహమ్మదాబాద్, చిన్నాయిపల్లి, నంచర్ల, గాదిర్యాల్ గ్రామాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. వీరంతా తిరిగి తమ పాత స్థానాలకు వెళ్లి విధులు నిర్వహించాల్సిందే. జిల్లాలోని ఆయా మండలాల్లోని 48 పాఠశాలల్లో నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లిపోయిన వారు ప్రభుత్వ నిర్ణయంతో తమ యథాస్థానాలకు వెళ్లాల్సిందే.



పీర్లబండతండాలో మూతపడిన ప్రాథమిక పాఠశాల

ఆరు కిలోమీటర్లు ఆటోలో..


తమ తండాలో పాఠశాల మూతపడడం మూలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీసం ఐదవ తరగతి వరకు స్థానికంగా ఉంటే పిల్లలకు సౌకర్యంగా ఉంటుంది. అది లేకపోవడంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెన్నాచేడ్‌కు పంపిస్తున్నాం. ప్రస్తుతం నలంద పాఠశాలలో ఇద్దరు పిల్లలు మూడో తరగతి చదువుతున్నారు. వీరితో తండాలో పిల్లలందరూ ఆటోలో చదువుకోడానికి అక్కడికే వెళుతున్నారు.
– నెహ్రూనాయక్, పీర్లబండ తండా, విద్యార్థి తండ్రి

మూతపడ్డ బడులన్నీ తెరుస్తున్నాం..


జిల్లాలో 48 మూతపడ్డ ప్రాథమిక పాఠశాలలు తిరిగి ప్రారంభిస్తున్నాం. గతంలో మూతపడ్డ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఇచ్చిన డిప్యూటేషన్లు అన్ని రద్దు చేశాం. తమకు పోస్టింగ్ ఇచ్చిన సొంత పాఠశాలకే ఉపాధ్యాయులు తిరిగి వెళ్లాలి. త్వరలో జరిగే బడిబాట సందర్భంగా అదే గ్రా మంలో కార్యక్రమాలు నిర్వహించాలి. జిల్లాలో అన్ని పాఠశాలలో కలిపి సుమారు 350 వరకు ఉపాధ్యాయపోస్టులు ఖాళీలు ఉన్నాయి.డీఎస్సీ ద్వారా ప్రభుత్వం వీటిని భర్తీ చేయనుంది.
– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్ జిల్లా

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం


అపూర్వ (ఫైల్)

అయిజ: హైదరాబాద్‌లోని మేడ్చల్ ఔటర్ రింగ్‌రోడ్డుపై చోటుచేసుకున్న ప్రమాదంలో అయిజకు చెందిన అపూర్వ (14) దుర్మరణం చెందింది. వివరాలిలా.. అయిజకు చెందిన పాగుంట రవి తన కుమారుడిని ఇంటర్‌లో చేర్పించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. కళాశాలలో కుమారుడిని చేర్పించి, తిరుగు ప్రయాణంలో యాదగిరిగుట్టలో స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి వస్తుండగా.. మేడ్చల్ సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై కారు అదుపుతప్పి ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రవి కూతురు అపూర్వ అక్కడికక్కడే మృతిచెందగా.. రవి, అతడి భార్య రేఖ, కుమారుడు కౌశిక్, డ్రైవర్ వీరేశ్‌లకు గాయాలయ్యాయి. ఈఘటనతో అయిజలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డీసీఎం, బైక్ ఢీకొని మరో వ్యక్తి..


ఆనంద్‌సాగర్ (ఫైల్)

పెబ్బేరు రూరల్: డీసీఎం, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అయ్యవారిపల్లి భారత్ పెట్రోల్ పంపు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. అయ్యవారిపల్లికి చెందిన కడుకుంట్ల ఆనంద్‌సాగర్ (40) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి భారత్ పెట్రోల్‌బంక్ దగ్గర కుడివైపు తిరుగుతుండగా.. పెబ్బేరు వైపు నుంచి వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆనంద్‌సాగర్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నాడు. భార్య కడుకుంట్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి


నిరంజన్ (ఫైల్)

దామరగిద్ద: బావిలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని కాన్‌కుర్తికి చెందిన గడ్డమీది నిరంజన్ (17) క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఉదయం గడిమున్కన్‌పల్లి శివారులోని ఓ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. బావి వట్టిపోవడంతో పొలంలోని రైతులు బోరు బావి నీటితో నింపారు. నీటిమట్టం తక్కువగా ఉండటం.. యువకుడు ఎత్తు నుంచి తలకిందులుగా దూకడంతో అడుగున ఉన్న రాళ్లు తలకు బలంగా తలగడంతో తీవ్ర గాయమై మృతిచెందాడు. బావిలో ఈత కొడుతున్న ఇతరులు గుర్తించి వెంటనే కుటుంబీలకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి బావిలో గాలించి మృతదేహం బయటకు తీశారు. నిరంజన్‌కు తల్లి బాబమ్మ, అన్న ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు

గోపాల్‌పేట: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని ఢీకొట్టిన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు రేవల్లి ఎస్‌ఐ తిరుపతిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రేవల్లి మండలం నాగపూర్‌కు చెందిన కత్తె రాములు, శివ శనివారం సాయంత్రం బైక్‌పై స్వగ్రామం నుంచి కొత్తబండరావిపాకుల వైపు వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. శివ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోస్టింగ్‌లు ఎప్పుడో?

గురుకుల ఉపాధ్యాయ పోస్టింగ్ ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు


జడ్చర్లలోని గురుకుల విద్యాలయం

- అడ్డంకిగా మారిన ఎన్నికల కోడ్
- ఉమ్మడి జిల్లాలో 500 మందికి పైగా ఎంపిక

జడ్చర్ల: గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు పోస్టింగ్ ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. గత మార్చి 4న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నా.. నేటి వరకు పోస్టింగ్ ఉత్తర్వులు అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఓవైపు గురుకులాలకు ఎంపికయ్యామన్న సంతోషం ఉన్నా.. పోస్టింగ్ ఇవ్వకపోవడం తమను ఆందోళనకు గురిచేస్తుందని వాపోతున్నారు. ఎక్కువగా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారే గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారని.. ప్రస్తుతం వారికి కొత్త ఉద్యోగం రాక.. ఉన్న ఉద్యోగం ఊడి, రెంటికి చెడ్డ రేవడిలా తయారైందని పేర్కొంటున్నారు.

గడువు సమీపిస్తున్నా..

విద్యాలయాలు పునఃప్రారంభమయ్యే సమయం సమీపిస్తున్నా గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా 500 మందికి పైగా అభ్యర్థులు పోస్టులకు ఎంపికయ్యారు. వారిలో ఎక్కువ శాతం మధ్య వయసు వారే ఉన్నారు. గడువుకు ముందే ఉత్తర్వులు జారీచేస్తే, పిల్లలు ఇతర కుటుంబ సభ్యులతో తమకు కేటాయించిన గురుకుల స్థలాలకు మారే అవకాశం ఉంటుంది. పోస్టింగ్ ఉత్తర్వులు సకాలంలో ఇవ్వకపోవడంతో తమ పిల్లల చదువు, కుటుంబాల తరలింపుపై ఓ కొలిక్కి రాలేకపోతున్నామని వాపోతున్నారు.

శిక్షణ ఏది?

నియామక ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు కనీసం అంతర్గత అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు అలాంటి చర్యలు ఎక్కడా తీసుకోలేదు. ముందస్తుగా శిక్షణ నిర్వహిస్తే, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు సాఫీగా తరగతులు కొనసాగే అవకాశం ఉంటుంది.

ఉత్తర్వులు ఇవ్వాలి..



గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయిన అభ్యర్థులకు త్వరగా పోస్టింగ్ ఉత్తర్వులు అందజేయాలి. ఉద్యోగాలు సాధించేందుకు ఎంతో సమయం పట్టింది. ఇంకా ఆలస్యం చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తే, కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటాం.

– పి.జైపాల్‌రెడ్డి, పీజీటీ గణితం, జడ్చర్ల

ఆందోళన చెందుతున్నారు..



గురుకుల ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకుని నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు పోస్టుల కేటాయింపు, శిక్షణ తదితర ప్రక్రియకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఎంపికయిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యా సంవత్సరం సమీపిస్తున్న నేపథ్యంలో త్వరగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చి న్యాయం చేయాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, టీజీటీ భౌతిక శాస్త్రం, జడ్చర్ల

ఎన్నికల కోడ్‌తో..

గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన కొన్ని రోజులకే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం పోస్టింగ్ ఉత్తర్వులకు అడ్డంకిగా మారింది. ఈనెల మొదటి వారంలో కోడ్ ముగియనున్న నేపథ్యంలో పోస్టింగ్‌లకు సంబంధించిన ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తేనే, కొత్త పోస్టింగ్‌ల కేటాయింపుపై స్పష్టత వస్తుందని వారు భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చి, తమ ఆందోళనకు తెరదించాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాల ముఠా గుట్టు రట్టు


నకిలీ విత్తనాల ముఠా వివరాలను వెల్లడిస్తున్న సీఐ రవిబాబు

- రైతులే లక్ష్యంగా దళారుల దందా
- నంద్యాల నుంచి రాష్ట్రానికి లూజ్ పత్తి విత్తనాలను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు
- ఐదుగురి అరెస్టు
- పరారీలో ఏ–1 నిందితుడు
- వివరాలు వెల్లడించిన సీఐ రవిబాబు


పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

ఉండవెల్లి: రైతులే లక్ష్యంగా నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 31 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్న ఆరుగురిలో ఐదుగురిని అరెస్టుచేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవిబాబు వెల్లడించారు. నంద్యాల నుంచి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గతనెల 30వ తేదీన ఉండవెల్లి మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బొలేరో వాహనంలో 18 క్వింటాళ్ల లూజ్ పత్తి విత్తనాలను గుర్తించి.. ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ విత్తనాలను పరీక్షల నిమిత్తం వ్యవసాయాధికారులు ల్యాబ్‌కు పంపించగా, నకిలీ విత్తనాలని తేలింది. దీంతో పోలీసులు నకిలీ విత్తనాల గుట్టును రట్టుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈమేరకు నంద్యాల జిల్లా అయ్యలూరిమెట్టలోని బొబ్బూరి జిన్నింగ్ మిల్లు నుంచి టాటా విన్‌స్ట్రా వీ–30 గూడ్స్ వాహనంలో నకిలీ విత్తనాలను తరలిస్తున్నట్లు గుర్తించి.. కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఉండవెల్లి, రాజోళి ఎస్‌ఐలు శ్రీనివాసులు, జగదీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అయ్యలూరిమెట్టలోని బొబ్బూరి జిన్నింగ్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా, రెండున్నర క్వింటాళ్ల నకిలీ విత్తనాలు లభ్యమయ్యాయి. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టి.. హైదరాబాద్‌లోని ఆటోనగర్ వనస్థలిపురంలో మరో 10 క్వింటాళ్ల పత్తి విత్తనాలను గుర్తించారు. ఇలా మొత్తం 31 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న ఆరుగురిలో ఐదుగురిని అరెస్టుచేసి, మహబూబ్‌నగర్ కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. విత్తనాల విలువ దాదాపు రూ.15 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో సీసీఎస్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాల ముఠా వివరాలిలా..

- నకిలీ పత్తి విత్తనాల ఏ–1 నిందితుడు అముల్ కుమార్ అయ్యార్ క్రాప్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొంపల్లి, హైదరాబాద్‌లో ఉంటున్నట్లు సీఐ తెలిపారు. అతడు పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.
- ఏ–2 నిందితుడు కేఎస్ రాజశేఖర్ అలియాస్ రవి మహబూబ్‌నగర్ ఎదిరలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్నాడు. అతడు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.
- ఏ–3 నిందితుడు ఉప్పరి వెంకటేశ్వర్లు కర్నూల్ జిల్లాలోని కొత్తపల్లి మండలం, ముసలిమడుగు గ్రామానికి చెందిన వ్యక్తి. అతడు నంద్యాలలోని అయ్యార్ ప్రైవేటు విత్తన కంపెనీలో సీడ్ ప్రొడ్యూషన్ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్నాడు.
- ఏ–4గా ఉన్న పండుగాయల రాముడు కర్నూల్ జిల్లా దొర్నిపాడు మండలం, చక్కరాజు వేముల గ్రామానికి చెందిన వ్యక్తి. అతడు సీడ్ ఆర్గనైజింగ్‌లోనే ఉంటూ వ్యవసాయం చేస్తుంటాడు.
- ఏ–5 నిందితుడు మేలుకోట రామశేషయ్య కర్నూల్ జిల్లా దొర్నిపాడు మండలం, రాముల ఆలయం కాలనీలో నివాసముంటున్నాడు.
- ఏ–6గా ఉన్న పల్లా కోటేశ్వరరావు గుంటూరు (పల్నాడు) జిల్లా నకరికల్లు మండలం, చల్లగుండ్లకు చెందిన వ్యక్తి. అతడు గూడ్స్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని సీఐ తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నందీకర్

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వీపనగండ్లకు చెందిన గొల్ల కినమోని సత్యనారాయణ ఆదివారం ఉదయం 10:30 గంటల సమయంలో ఇంటికి తాళంవేసి, తన భార్య రాధతో కలిసి రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాన్ని పగులగొట్టి, బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ. 56,500 నగదును చోరీ చేశారు. రాష్ట్రావతరణ వేడుకల అనంతరం ఇంటికి చేరుకున్న సత్యనారాయణ చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ నందీకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. వనపర్తి నుంచి క్లూస్ టీంను రప్పించి, వేలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, 20 రోజుల కిందట సంగినేనిపల్లిలో కూడా చోరీ చోటుచేసుకుంది. చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన షాఅలీ ఉర్సు


దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

అలంపూర్: పట్టణంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న హజ్రత్ షాఅలీ పహిల్వాన్ ఉర్సు ఆదివారంతో ముగిసింది. ఉత్సవాల చివరి రోజు మహిళలు ప్రత్యేకంగా ఉర్సు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి, షాఅలీ సర్ ముబారక్, ధడ్ ముబారక్ దర్గాలను దర్శించుకున్నారు. ఉర్సు సందర్భంగా వెలసిన మిఠాయి, ఆటబొమ్మలు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా కనిపించాయి. రంగుల రాట్నాలు, జాయింట్ వీల్స్ వద్ద పిల్లలు సందడి చేశారు. ఉత్సవాల్లో పెద్ద కిస్తీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రామన్‌పాడుకు 13 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,012 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేయగా.. సమాంతర కాల్వ నుంచి 13 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

ప్రైవేట్ పాఠశాల హెచ్‌ఎంపై హత్యాయత్నం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ


రాజేందర్‌గౌడ్

పెబ్బేరు రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో ఓ ప్రైవేట్ పాఠశాల హెచ్‌ఎం, యాజమానిపై శనివారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలం రాజాపురానికి చెందిన రాజేందర్‌గౌడ్ 15 ఏళ్ల కిందట వనపర్తి జిల్లా, పెబ్బేరు మున్సిపాలిటీలోని కిష్టారెడ్డిపేట వద్ద మాంటిస్సోరి ప్లేవే పాఠశాలను స్థాపించారు. హెచ్‌ఎంగా అతనే విధులు నిర్వహిస్తూ.. భార్య, ఇద్దరు పిల్లలతో అక్కడే నివాసం ఉంటున్నారు. పాఠశాలలోని తను ఉంటున్న ఇంట్లో రాజేందర్‌గౌడ్ నిద్రిస్తుండగా.. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో మెడపై(ఎడమ చెవి కింది భాగంలో) తల వెనుక భాగంలో దాడి చేశారు. రక్తపు మడుగులో ఉన్న అతడిని భార్య ప్రత్యూష, కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక సరోజని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిక్షించి అతడి పరిస్థితి విషమంగా ఉందని, హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. వెంటనే అంబులెన్స్‌లో సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు పెబ్బేరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఉదయం క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. సంఘటన స్థలాన్ని వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, కొత్తకోట సీఐ రాంబాబు పరిశీలించారు. ఘటనకు సంబంధించిన కారణాలపై పాఠశాలలో పనిచేసే వారితో ఆరా తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాంబాబు తెలియజేశారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి


నాగర్‌కర్నూల్ ప్రియాంక ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టిన కుటుంబ సభ్యులు

ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన


పద్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: వైద్యం వికటించి ఓ గర్భిణి మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తాడూరు మండల కేంద్రానికి చెందిన మహేందర్‌కు అదే మండలం పొల్మూరుకు చెందిన పద్మ (34)కు 20 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి 13 ఏళ్ల కూతురు ఉంది. 7 నెలల కిందట పద్మ రెండోసారి గర్భం దాల్చగా.. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూయించుకుంటున్నారు. ఆదివారం ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రియాంక ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోయినప్పటికీ.. సిబ్బంది గర్భిణిని చేర్చుకొని చికిత్స అందించారు. ఈక్రమంలో వైద్యం వికటించడంతో ఆమె మృతిచెందింది. ఆస్పత్రి సిబ్బంది విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు చెప్పకుండా, జిల్లా జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు పద్మను జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కోపోద్రిక్తులైన బాధిత కుటుంబ సభ్యులు.. ప్రియాంక ఆస్పత్రికి చేరుకొని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ కనకయ్యగౌడ్, ఎస్‌ఐ గోవర్ధన్ ఆస్పత్రి వద్దకు చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై సీఐ కనకయ్యగౌడ్‌ను వివరణ కోరగా.. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. కాగా, మహేందర్, పద్మలు శనివారం పెళ్లి రోజు వేడుకలు జరుపుకొన్నారు. మరుసటి రోజు పద్మ మృతిచెందడంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలోనూ ప్రియాంక ఆస్పత్రిలో పలు ఘటనలు చోటుచేసుకున్నాయని.. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆస్పత్రి సీజ్


జిల్లా కేంద్రంలో ప్రియాంక ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్

గర్భిణికి నిర్లక్ష్యంగా వైద్యం చేసి మృతికి కారణమైన ఆస్పత్రిని సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డా.సుధాకర్‌లాల్ తెలియజేశారు. ఆదివారం రాత్రి డీఎంహెచ్‌ఓ వైద్య బృందంతో ప్రియాంక ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యం అందించిన ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం మాట్లాడారు. తాడూరు మండల కేంద్రానికి చెందిన గర్భిణి పద్మకు కడుపునొప్పి రావడంతో ఆమె ఆసుపత్రి రాగా.. వైద్యురాలు అందుబాటులో లేరని చెప్పారు. ఆస్పత్రిలోని నర్సు అడ్మిట్ చేసుకుని ఇంజక్షన్‌తో పాటు గ్లూకోజ్‌ను ఎక్కించారన్నారు. ఈ క్రమంలోనే గర్భిణి మృతిచెంది ఉండవచ్చని, లేదంటే వైద్యం వికటించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మార్గమధ్యంలో మృతిచెంది ఉండొచ్చన్నారు. ప్రియాంక ఆస్పత్రిని సీజ్ చేశామని, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదికను కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఇవ్వనున్నట్లు వివరించారు.

అవగాహనతోనే ఆరోగ్యం

- ఇష్టారీతిగా పురుగుల మందు పిచికారి
- అనారోగ్యం బారిన రైతులు
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

పాడి-పంట
అధికారి సలహా: జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట


బత్తాయి తోటలో మందు పిచికారి చేస్తున్న రైతు

కోస్గి: ఎంతో కష్టపడి వేసిన పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు రైతులు రకరకాల పురుగు మందులను పిచికారి చేస్తున్నారు. ఈ విషయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో ఏటా రైతులు అనారోగ్యం బారిన పడటమే కాకుండా మృతి చెందిన ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పంటలకు సైతం కొత్తకొత్త రోగాలు వస్తుండటంతో మార్కెట్‌లో గాడత ఎక్కువగా ఉన్న పురుగుల మందుల్ని విచ్చలవిడిగా అమ్ముతున్నారు. రైతులు పంటలకు ఏవైన చీడపీడలు ఆశించినట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి సరైన మందుల్ని తీసుకుని వారి సలహాలు, సూచనలు పాటించాలని సూచిస్తున్నారు. కానీ రైతులు ఎవరూ అధికారుల్ని సంప్రదించకుండానే వ్యాపారుల్ని నేరుగా కలవడంతో ఇష్టానుసారంగా మందుల్ని అంటగడుతున్నారు. మందులు తీసుకునేటప్పుడు అధికారులను సంప్రదించాలని, అలాగే మందుల పిచి కారి విషయంలో సైతం అనారోగ్యం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ సూచిస్తున్నారు. పురుగుల మందు పిచికారి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని ఏట వివరించారు.

మందుల పిచికారిలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు

- గాలికి ఎదురుగా పురుగు మందు పిచికారి చేయరాదు. ఇలా చేయడం వల్ల పురుగుల మందు శరీరంపై పడుతుంది.
- పిచికారి సమయంలో చేతులకు తొడుగులు, ముఖానికి మాస్కు తప్పకుండా ధరించాలి.
- పిచికారి సమయంలో మధ్యలో నీరు, ఆహార పదార్థాలు తీసుకోరాదు.
- పని పూర్తయిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.
- పిచికారి సమయంలో శరీరాన్ని మొత్తం కప్పి ఉంచే విధంగా ప్రత్యేక దుస్తులు వాడుతూ కళ్లజోడు సైతం వాడాలి.
- వాడిన డబ్బాలను ఎట్టి పరిస్థితిలో పశువుల పాకలో భద్రపరచరాదు.
- మందుల వాసనతో పశువులు సైతం అనారోగ్యానికి గురై మృతి చెందే ప్రమాదం ఉంది.
- వాడిన పురుగు మందు డబ్బాలను, ప్యాకెట్లను భూమిలో పాతిపెట్టాలి.
- మందుల్ని పిచికారి చేసిన తర్వాత రైతుకు వాంతులైన, చెమటలు పట్టిన, ఆయాసానికి గురైన వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

లెక్క ఏదైనా... ఫ్యాన్ పక్కా

అసెంబ్లీ ఎన్నికలపై మెజార్టీ జాతీయ, రాష్ట్ర మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్ స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : పేదలకు, పెత్తందారులకు.. విశ్వసనీతయకు, వంచనకు మధ్య పోరుగా దేశ వ్యాప్తంగా అత్యంత ఆసక్తి రేకెత్తించిన ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయమని... ఏ లెక్కన చూసుకున్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం పక్కా అని అధిక శాతం జాతీయ, రాష్ట్ర మీడియా, సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్ తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో 50 శాతానికిపైగా ఓట్లతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధిస్తుందని ఇవన్నీ స్పష్టం చేశాయి. దేశ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృత యంత్రాంగం ఉన్న టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్‌కు చెందిన టైమ్స్‌నౌ–ఈటీజీ రీసెర్చ్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో 50 శాతం ఓట్లతో వైఎస్సార్‌సీపీ 14 లోక్‌సభ స్థానాలను చేజిక్కించుకుంటుందని.. ఎన్‌డీఏ కూటమి 48 శాతం ఓట్లతో 11 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని వెల్లడయింది. టైమ్స్ ఆఫ్ ఇండియా తరహాలోనే దేశ వ్యాప్తంగా విస్తృత యంత్రాంగం ఉన్న దైనిక్ భాస్కర్ గ్రూప్... రాష్ట్రంలో 15–17 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని.. ఎన్‌డీఏ కూటమి 8–9 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని తన ఎగ్జిట్ పోల్స్ ద్వారా తేల్చిచెప్పింది. ఇక తెలుగు రాష్ట్రాల్లో టీవీ9 వంటి మీడియా సంస్థలు, సెఫాలజిస్టులు, ఆరా వంటి ప్రతిష్ఠాత్మక సర్వే సంస్థలు నిర్వహించిన 32 ఎగ్జిట్ పోల్స్‌లో 24 ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యమని.. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టమయింది.

బీజేపీ భజన చేసే జాతీయ మీడియా ఎగ్జిట్ పోల్స్ తద్భిన్నం..

బీజేపీ భజన చేసే ఇండియాటుడే గ్రూప్, జీన్యూస్.. ఈనాడుతో భాగస్వామ్యం ఉన్న నెట్‌వర్క్‌లోని సీఎన్ఎన్ న్యూస్–18 వంటి రెండు మూడు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ మాత్రం రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి విజయం సాధిస్తుందని తేల్చడం గమనార్హం. రాజధాని అంశంతోపాటు స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడంపై ప్రజల్లో సానుభూతి వచ్చిందని.. అదే ఎన్‌డీఏ కూటమి విజయానికి బాటలు వేసిందని ఆ సంస్థలు విశ్లేషించాయి. కానీ వాస్తవంగా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ఇటు వైఎస్సార్‌సీపీగానీ అటు ఎన్‌డీఏగానీ రాజధాని అంశాన్ని ఎక్కడా పెద్దగా ప్రస్తావించలేదు. ఇక స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు రాష్ట్రంలో ఎక్కడా చిన్నపాటి బంద్‌లు గానీ, ర్యాలీలు గానీ, నిరసనలు గానీ జరగనేలేదు. తప్పు చేశాడు కనక అరెస్టయ్యాడనే రీతిలో జనం స్పందించారు. దీంతో హైదరాబాద్‌లో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు కూపన్లు ఇచ్చి మరీ 'ఐటీ ఉద్యోగుల' పేరిట స్థానికంగా ఒక ఈవెంట్‌లా నిరసన కార్యక్రమం చేశారు. అలాంటిది ఈ రెండు అంశాలూ ప్రభావం చూపిస్తున్నాయని, అందుకే కూటమి గెలుస్తోందని ఈ జాతీయ ఛానెళ్లు చెప్పిన జోస్యం నూటికి నూరుపాళ్లూ తప్పవుతుందని రాష్ట్ర వ్యవహారాలను దగ్గర నుంచి పరిశీలిస్తున్న విశ్లేషకులు స్పష్టంగా చెబుతున్నారు.

ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇవి..

సంఖ్య	సర్వే సంస్థ	వైఎస్సార్ సీపీ	కూటమి
1	పార్థదాస్(చాణక్య)	110-120	55-65
2	జన్మత్‌పోల్స్	95-103	67-75
3	టీవీ9 పోల్	110-120	55-65
4	ర్యాప్ స్ట్రాటజీస్	158	17
5	స్మార్ట్ పోల్	82(+/-8)	93(+/-8)
6	ఆరా	94-104	71-81
7	ఆత్మసాక్షి	98-116	59-77
8	హెచ్ఎంఆర్	91-101	73-83
9	క్యూ-మెగా	120+	50-60
10	పొలిటికల్ లెబొరేటరీ	108	67
11	రేస్	117-128	47-58
12	ఎన్డీఏ ఎగ్జిట్‌పోల్	143	32
13	ఎల్ఆర్ సర్వే	93	82
14	నాగన్న సర్వే	118	49
15	సీ-నెక్స్ట్ ఏపీ	123	52
16	ఎస్ఏఎస్‌గ్రూప్ ఐబీఎస్ఎస్ టీమ్ హైదరాబాద్	126	49
17	కేఏస్ ప్రసాద్	146	29
18	కోగంటి సత్యం	110-125	45-55
19	పోల్ స్ట్రాటజీస్	115-125	50-60
20	అగ్నివీర్	124-128	46-49
21	ఆపరేషన్ చాణక్య	95-102	64-68
22	సీపీఎస్	97-108	66-78
23	ఫస్ట్‌స్టెప్ సొల్యూషన్స్	119	56
24	సీపీఆర్ఎస్	120-135	40-55
25	చాణక్య స్ట్రాటజీస్	39-49	114-125
26	రింగ్ టు పోల్	60	115
27	పీపుల్ పల్స్	45-60	111-135
28	నేషనల్ ఫ్యామిలీ	65-71	104-115
29	పయనీర్	31	144
30	పోల్ పల్స్	45-60	108-116
31	రైజ్	52	123
32	కేకే సర్వే	31	133-144

కనీస జాగ్రత్తలు కూడా తీసుకోని ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా?

విచిత్రమేంటంటే 'ఇండియా టుడే– మై యాక్సిస్' సంస్థ శనివారంనాడు దేశవ్యాప్త ఎగ్జిట్‌పోల్స్‌ను వెలువరించింది. దీన్లో బీజేపీ నినాదమైన '400' సీట్లకు ఆ పార్టీని చేర్చటమే లక్ష్యంగా ఒకో రాష్ట్రంలో స్వీప్ అంటూ ముందుకు వెళ్లిపోయినట్లు స్పష్టంగా కనిపించింది. పైపెచ్చు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి 2 నుంచి 4 లోక్‌సభ స్థానాలు వస్తాయని మాత్రమే చెప్పిన ఇండియా టుడే సంస్థ... ఆ సందర్భంగా వైఎస్సార్ సీపీ గుర్తును కూడా ఆప్ గుర్తయిన చీపురుగా చూపించింది. విశేషమేంటంటే దీన్నే తెలుగుదేశం పార్టీ తన ట్విటర్ ఖాతాలోనూ పోస్టు చేసుకుంది. మరి పార్టీ గుర్తు విషయంలో కూడా జాగ్రత్తలు పాటించకుండా చేసిన ఈ ఎగ్జిట్ పోల్స్‌ను నమ్మేదెలా? ఇక కొన్ని రాష్ట్రాల విషయంలోనైతే కొన్ని ఎగ్జిట్ పోల్స్ అక్కడ వాస్తవంగా ఉన్న మొత్తం స్థానాలకన్నా ఎక్కువ స్థానాలు ఎన్‌డీఏ గెలుస్తుందని చూపించటాన్ని ఇప్పటికే ట్విటర్లో పలువురు ట్రోల్ చేస్తున్నారు కూడా. ఇదే ఇండియా టుడే– మై యాక్సిస్ సంస్థ 2021లో బెంగాల్లో చేసిన ఎగ్జిట్‌పోల్స్, 2023లో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో చేసిన ఎగ్జిట్‌పోల్స్ పూర్తిగా రివర్సయ్యాయనేది ఇక్కడ గమనార్హం. అంతేకాదు. తాజాగా బీజేపీ కూటమికి దేశంలో అత్యంత భారీగా స్థానాలు వస్తాయని పేర్కొన్న జాతీయ మీడియా సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో చిత్రవిచిత్రమైన తప్పులు కనిపించాయి. ఇండియాటుడే గ్రూప్‌లోని ఆజ్ తక్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో తమిళనాడులో కాంగ్రెస్ 9 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తే.. అక్కడ 13–15 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధిస్తుందని తేల్చడంతో చర్చలో పాల్గొన్న వారే విస్తుపోయారు. రాజస్థాన్‌లో ఉన్నదే 25 లోక్‌సభ స్థానాలైతే.. ఆ రాష్ట్రంలో 33 స్థానాల్లో ఎన్‌డీఏ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో టుడేస్ చాణక్య వెల్లడించడం గమనార్హం. జార్ఖండ్‌లో సీపీఐ (ఎంఎల్) ఒక స్థానంలో పోటీ చేస్తే.. రెండు నుంచి మూడు స్థానాల్లో ఆపార్టీ విజయం సాధిస్తుందని ఆజ్‌తక్ ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడించింది. హర్యానాలో ఉన్నదే 10 లోక్‌సభ స్థానాలైతే 16–19 స్థానాల్లో ఎన్‌డీఏ విజయం సాధిస్తుందని జీన్యూస్ ఎగ్జిట్ పోల్స్‌లో తేల్చడం విస్మయకరమే. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్నవే నాలుగు లోక్‌సభ స్థానాలైతే.. అక్కడ ఎన్‌డీఏ 6–8 స్థానాల్లో విజయం సాధిస్తుందని జీన్యూస్ తేల్చింది. విశేషమేంటంటే ఈ సంస్థలన్నీ రాష్ట్రంలో కూటమికే మెజారిటీ లోక్‌సభ స్థానాలు దక్కుతున్నాయని చెప్పాయి. లోతుగా పరిశీలించినట్లయితే ఈ జాతీయ మీడియా సంస్థలకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి యంత్రాంగమూ లేదు. వీటిలో చాలావరకూ ప్రజల అభిప్రాయాన్ని ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా తెలుసుకుని.. వాటినే ఎగ్జిట్ పోల్స్‌గా వెల్లడించాయి. గ్రామీణ ఓటర్లు, మహిళలు, వైఎస్సార్ సీపీకి ఎప్పుడూ అండగా ఉండే బలహీనవర్గాలు ఇలాంటి సర్వేల్లో పాల్గొనే అవకాశం తక్కువ. దీన్ని బట్టి చూస్తే.. ఈ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్... జూన్ 4న పూర్తి స్థాయిలో తిరగబడతాయని స్పష్టంగానే చెప్పొచ్చు.

వైఎస్సార్‌సీపీ ఓడిపోయే అవకాశమే లేదు..

రాష్ట్రంలో ఎక్కడికక్కడ పరిశ్రమలను తెస్తూ... గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ... ఐదేళ్లుగా కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలు.. విప్లవాత్మక సంస్కరణలను జనం పెద్ద ఎత్తున ఆదరించారు. ఈ విషయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు నిర్వహించిన 'సిద్ధం' సభలతో రుజువయింది. గ్రామీణ ప్రాంత ప్రజలు.. మహిళల్లో వైఎస్సార్‌సీపీకి అత్యంత ఆదరణ ఉందని.. ఇదే ఆపార్టీ విజయానికి బాటలు వేస్తుందని ఇవే జాతీయ మీడియా సంస్థలు గతంలో విశ్లేషించాయి. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక శాతం ఓట్లు పోల్ కావడం.. మహిళలు ఎన్‌డీఏ కూటమి కంటే వైఎస్సార్‌సీపీకి 12 శాతం అధికంగా వేశారని.. ఇది ఆపార్టీ ఘనవిజయానికి బాటలు వేస్తుందని ఆరా మస్తాన్, చాణక్య పార్థదాస్‌లు కుండబద్ధలు కొట్టారు. వీటిని పరిగణనలోకి తీసుకుంటే తాము ఓడిపోయే అవకాశమే లేదని వైఎస్సార్‌సీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.



టైమ్స్ నౌ–ఈటీజీ ఎగ్జిట్ పోల్‌లో వైఎస్సార్‌సీపీ హవా

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లతో 50–58 సీట్లకే పరిమితమవుతుందని వెల్లడించింది. అలాగే, లోక్‌సభ పోలింగ్ విషయానికొస్తే.. వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 14 ఎంపీ స్థానాలు, ఎన్డీయే కూటమి 48 శాతం ఓట్లతో 11 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని తెలిపింది. ఈసారి ఏపీలో దాదాపు 82శాతం పోలింగ్ నమోదైందని.. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇది ఇంచుమించు రెండుశాతం అధికమని వివరించింది. అంతేకాక, మహిళల ఓటింగ్ కూడా ఈ దఫా 15శాతం అధికంగా నమోదైందని టైమ్స్ నౌ–ఈటీజీ రీసెర్చ్ తెలిపింది.

కౌంటింగ్ నాడు అక్రమాలకు తెగబడటానికే!

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు వస్తుండటంలో పలువురు సెఫాలజిస్టులను చంద్రబాబు నాయుడు, లోకేశ్ బెదిరించినట్లు వాళ్లే వ్యాఖ్యానిస్తున్నారు. ఓ సర్వే సంస్థ లోకేశ్ బెదిరింపులను తట్టుకోలేక... ఫలితాలను అట్నుంచి ఇటు మార్చి కూటమి గెలుస్తున్నట్లుగా ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఎలాగూ రెండ్రోజుల్లో తేలే ఫలితాల కోసం చినబాబు– చంద్రబాబు ఎందుకు ఇంతలా బెదిరింపులకు పాల్పడుతున్నారనే అంశాన్ని నిపుణులు లోతుగా విశ్లేషిస్తున్నారు. తామే గెలుస్తున్నామనే భ్రమలు కల్పించటం ద్వారా వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నిరుత్సాహాన్ని నింపి... కౌంటింగ్ రోజున అవసరమైతే వారిని ప్రలోభపెట్టో, బెదిరించో తమ పబ్బం గడుపుకోవాలనేది తండ్రీ కొడుకుల ఆలోచనగా చెబుతున్నారు. ఈసీ ఎలాగూ తమకే సహకరిస్తుంది కనక ఎలాంటి దారుణాలకైనా వెనకాడకూడదన్నది వీళ్ల ఆలోచనగా చెబుతున్నారు. అయితే పురిట్లోనే సంధికొట్టినట్లు చాలామంది సెఫాలజిస్టులు వీరి బెదిరింపులకు లొంగకుండా వైఎస్సార్‌సీపీ గెలుస్తున్నదని చెప్పటం 'బాబు'లిద్దరికీ మింగుడుపడటం లేదు.

నాలుక్కర్చుకున్న ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా

- రాష్ట్ర ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్‌పై విస్తుపోయిన రాజకీయ విశ్లేషకులు
- గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళలు అధిక శాతం వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచారన్న రాజ్‌దీప్ సర్దేశాయ్
- మీరు చేసిన సర్వే సహేతుకంగా కన్పించడం లేదంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్‌గుప్తాకు చురక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలపై వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్‌పై ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా నాలుక్కర్చుకుంది. యాక్సిస్ మై ఇండియా నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌ను ఇండియాటుడే శనివారం ప్రసారం చేసింది. ఈ సర్వేపై దేశ వ్యాప్తంగా రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేయడంతో.. ఆదివారం ఇండియాటుడే టీవీలో చర్చ చేపట్టింది. 'ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసింది. ఐదేళ్లలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. డీబీటీ పథకాల ద్వారా రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి పేదలకు నేరుగా చేరాయి. జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు..ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఆకర్షితులయ్యారు. వారంతా ఈ ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచారని అంచనా వేస్తున్నాం'అని ఇండియా టుడే కన్సల్టింగ్ ఎడిటర్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అన్నారు. ఏపీలో జరిగిన మార్పును స్వయంగా చూశాను. పాఠశాలలు, ఆస్పత్రులు చాలా మార్పు కన్పించిందన్నారు. ఈ నేపథ్యంలో మీరు చేసిన సర్వే సహేతుకంగా లేదన్నది స్పష్టమవుతోందంటూ యాక్సిస్ మై ఇండియా అధినేత ప్రదీప్ గుప్తాకు రాజ్‌దీప్ సర్దేశాయ్ చురకలంటించారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్టు చేయడం వల్ల ప్రజల్లో సానుభూతి.. దక్షిణాది రాష్ట్రాల్లో ఐదేళ్లకు ఓ సారి ప్రభుత్వాన్ని మార్చే సంప్రదాయం ఉండటం ఏపీలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమికి అనుకూలించిందని ప్రదీప్ గుప్తా చెప్పారు. దీనిపై యాంకర్ రాహుల్ కన్వల్ స్పందిస్తూ.. కేజ్రీవాల్ అరెస్టు వల్ల ఢిల్లీ, పంజాబ్‌లో.. హేమంత్ సోరేన్ అరెస్టు వల్ల జార్ఖండ్‌లో ప్రజల్లో సానుభూతి రాలేదా.. అక్కడ ఎగ్జిట్ పోల్స్‌లో అది ప్రతిబింబించలేదేం అంటూ ప్రదీప్ గుప్తాను నిలదీశారు. తమిళనాడులో జయలలిత.. తెలంగాణలో కేసీఆర్ వరుసగా రెండు సార్లు విజయం సాధించారని ఎత్తిచూపారు. వీటిని పరిశీలిస్తే.. మీ సర్వే శాస్త్రీయంగా లేదేమోనని అనుమానాలు వ్యక్తం చేయడంతో ప్రదీప్‌గుప్తా నీళ్లు నమిలారు. ఇండియాటుడే–యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్ 2021లో బెంగాల్‌లోనూ అంచనాలు తప్పాయి. అక్కడ బీజేపీ విజయం సాధిస్తుందని చెప్పగా.. టీఎంసీ విజయం సాధించింది. గతేడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పగా.. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ విజయం సాధించింది.

స్కానింగ్ కేంద్రం సీజ్



శాంతినగర్: పట్టణంలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మౌనిక స్కానింగ్ కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. ఆదివారం జిల్లా వైద్యాధికారిణి డా. శశికళ, ఉప వైద్యాధికారి డా. సిద్దప్ప, మాత, శిశు సంరక్షణ కార్యక్రమ అధికారి డా. స్రవంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణుల సేవలకు సంబంధించి రిజిస్టర్ల గురించి కేంద్రం నిర్వాహకుడు, మౌనిక ప్రజా వైద్యశాల డా. మురళీ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చిన మహిళలతో మాట్లాడి వివరాలు సేకరించారు. మొబైల్ స్కానింగ్ యంత్రాన్ని వినియోగించి గర్భిణులకు స్కానింగ్ చేయడంతో పాటు ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు యంత్రాన్ని తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మొబైల్ స్కానింగ్ యంత్రం వినియోగించడం చట్ట విరుద్ధమని.. ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగిస్తుండటంతో సీజ్ చేస్తున్నట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలను కలెక్టర్‌కు అందజేస్తామని, ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు. తనిఖీల్లో ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎక్స్‌టెన్షన్ మాస్‌మీడియా అధికారి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

జడ్చర్ల: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో విశ్రాంత ఉద్యోగి బాలశంకర్ ఇంట్లో ఆదివారం చోరీకి ప్రయత్నించిన గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని విచారణ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువుల కంటైనర్ పట్టివేత

జడ్చర్ల: పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సంగారెడ్డి నుంచి కర్నూల్ వైపు పశువులను అక్రమంగా తరలిస్తుండగా, జడ్చర్ల వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి, పశువులను కల్వకుర్తి సమీపంలోని గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభచాటాలి



బాస్కెట్‌బాల్‌లో విన్నర్, రన్నరప్ జట్లతో డీవైఎస్ఓ, కోచ్‌లు

- జిల్లాలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభచాటాలని జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ అన్నారు. వేసవి శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఆయా జట్లు, క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు 10 గ్రామీణ ప్రాంతాల్లో, 12 పట్టణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించామన్నారు. శిబిరాల్లో చాలామంది చిన్నారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వేసవి శిక్షణ శిబిరాలకే పరిమితం కాకుండా నిరంతరంగా క్రీడలను ప్రాక్టిస్ చేయాలని, చిన్నారులు క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. క్రీడల్లో రాణించే వారికి మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, కోచ్‌లు సునీల్‌కుమార్, ఎండీ ఖలీల్, పర్వేజ్‌పాష, అంజద్, కంప్యూటర్ ఆపరేటర్ ఉమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..

బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఆర్చరీలో పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో అబ్దుల్ బాసిత్ అర్జున అవార్డి జట్టుట్ విన్నర్‌గా, జిమ్మి జార్జ్ అర్జున అవార్డి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో లక్కీ జట్టు, యశ్వంత్ జట్టు, బాలికల్లో హారిక, చైత్ర జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్‌లో అండర్– 9, 11, 13, 15, 17 విభాగాల్లో పోటీలు నిర్వహించి వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి మెడల్స్ అందజేశారు. ఆర్చరీలో అండర్– 10 ఇండియన్ రౌండ్‌లో సాయి ఆరాధ్య, అండర్– 13 విభాగం 20 మీ.,లో త్రివిక్రమ్, 40 మీ.,లో బృందయాదవ్, సహస్రయాదవ్, అండర్– 10 కంపౌండ్ 20 మీ.,లో శ్రీహితరాథోడ్, సాయి సిద్దిక్ష, రోషన్ ఏకలవ్య, అండర్– 13 కంపౌండ్ 30 మీ.,లో ఎస్.శ్రీవాస్తవ్, సాయి సమీక్ష, అయేషా సిద్దిఖీలు మెడల్స్ సాధించారు. అథ్లెటిక్స్‌లో చిన్నారులకు పోటీలు మెడల్స్ అందజేశారు.

కౌంటింగ్ అబ్జర్వర్ల నియామకం



అబ్జర్వర్లకు కౌంటింగ్ వివరాలను తెలియజేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: ఈనెల 4న నిర్వహించే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పర్యవేక్షణకు గాను ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ కౌంటింగ్ అబ్జర్వర్లుగా నియమించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌కు వచ్చిన కౌంటింగ్ అబ్జర్వర్లకు పూలమొక్కలు అందజేసి, స్వాగతం పలికారు. హర్యానా రాష్ట్ర 2002 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ అధికారి సత్పాల్ శర్మను వనపర్తి, గద్వాల, అల్లంపూర్ నియోజకవర్గాల కౌంటింగ్ అబ్జర్వర్‌గా.. మహారాష్ట్రకు చెందిన 2009 బ్యాచ్ ఐఏఎస్ రుచేష్ జైవన్షీకి నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ అబ్జర్వర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని కలెక్టర్ చెప్పారు. అనంతరం కౌంటింగ్ అబ్జర్వర్లు కలెక్టర్‌తో సమావేశమై ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన వివరాలతో పాటు సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. నియోజకవర్గాల వారీగా కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సోమవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జాకీర్ అలీ ఉన్నారు.

పిడుగుపాటుతో ఏడు గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న గ్రామస్తులు

మిడ్జిల్: పిడుగుపాటుకు గురై ఏడు గొర్రెలు మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వల్లభ్‌రావుపల్లికి చెందిన ఏదుల బాలస్వామి తన గొర్రెలను మేపేందుకు వేముల శివారుకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురువడంతో సమీపంలోని చెట్టు కిందకు గొర్రెల మందను చేర్చాడు. ఈక్రమంలో పిడుగుపాటుకు గురై ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని.. ప్రభుత్వం స్పందించి బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కంటైనర్ బోల్తా

- ఇద్దరికి గాయాలు
- జాతీయ రహదారిపై 3 కి.మీ. మేర నిలిచిన ట్రాఫిక్

అలంపూర్: జాతీయ రహదారిపై కంటైనర్ బోల్తాపడిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి కోరియర్ సరుకులతో కర్నూల్ వైపు వెళ్తున్న కంటైనర్ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ రాంబహదూర్, మాన్‌వేందర్‌లకు గాయాలయ్యాయి. వారిద్దరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కంటైనర్ రోడ్డుకు అడ్డంగా పడటంతో దాదాపు 3 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



జాతీయరహదారిపై బోల్తాపడిన కంటైనర్

రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తికి సిద్ధంకండి



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జలవిద్యుత్ కేంద్రం సీఈ, ఎస్ఈలు

దోమలపెంట: వాతావరణ శాఖ సమాచారం మేరకు రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున.. కృష్ణానదిలో నీటి వనరులను ఉపయోగించుకొని భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తికి ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది సిద్ధంగా ఉండాలని సీఈ సూర్యనారాయణ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం భూగర్భ జలవిద్యుత్ కేంద్రం, ఈగలపెంటలోని శక్తిసదన్ చీఫ్ ఇంజినీర్ పరిపాలన భవనం వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ అధికంగా ఉందని.. లోడ్ డిస్పాచ్ వారు అడిగిన వెంటనే విద్యుత్ అందించడానికి భూగర్భ జలవిద్యుత్ కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కేంద్రంలో విధులు నిర్వహించే ఓఅండ్ఎం ఇంజినీర్లు ఇతర సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 2022–23లో చేసిన విద్యుత్ ఉత్పత్తిని అధిగమించి, రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ సూర్యారావు, ఎస్ఎఓ మల్లికార్జున, డీఏవీ ప్రిన్సిపాల్ జె.ప్రసాద్ పాల్గొన్నారు.

హత్య చేసిన వారిని పట్టుకోకపోవడం దారుణం



సంతాప సభలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డిని గొడ్డలతో నరికి చంపిన దుండగులను ఇంకా పట్టుకోకపోవడం దారుణమని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. లక్ష్మీపల్లిలో ఆదివారం శ్రీధర్ రెడ్డి సంతప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. తాను పోలీస్ వృత్తిలో పనిచేశానని, కాని ఒక హత్య జరిగి 11 రోజులు గడుస్తున్నా.. నిందితుల ఆచూకి కనుక్కోకపోవడం పోలీసుల పనితనానికి నిదర్శనమన్నారు. కనీసం ఇక్కడి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి జూపల్లి ఇలాకలోనే ఇలా హత్య జరిగితే, ఆయన, ఆయన అనుచరుల పాత్ర లేకుంటే, బాధిత కుటుంబ సభ్యులను ఎందుకు పరామర్శించలేదన్నారు. శ్రీధర్ రెడ్డి హత్యలో పలువురి పాత్ర ఉందని వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా.. వారిని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేస్తూ.. కేసును పక్కదోవ పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ హత్యలను బీజేపీ ప్రోత్సహించదని వనపర్తి జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి అన్నారు. సంతప సభలో ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ రావుతో కలిసి పాల్గొన్నారు. నిందితులను పట్టుకునే వరకు బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావు, సీపీఎం నాయకులు రాజేందర్ గౌడ్, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రమణమ్మ, శ్రీధర్ రెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

166 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మద్దూర్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ రాంలాల్ తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు లారీ ద్వారా తరలిస్తున్నారని సమాచారం అందిందని చెప్పారు. వెంటనే లారీని, బొలెరో వాహనాన్ని పట్టుకున్నామని వివరించారు. కర్నూల్‌కు చెందిన లారీ డ్రైవర్ ఓబులేష 155 బస్తాల్లో (50 కిలోల బస్తా) రేషన్ బియ్యాన్ని నూకలుగా చేసి తీసుకెళ్తుండగా మద్దూరు కాంటా వద్ద పట్టుకున్నామని చెప్పారు. అదేవిధంగా మహమ్మద్ గౌస్ ఉద్దీన్ బొలెరో వాహనంలో 11 బస్తాల్లో రేషన్‌బియ్యాన్ని తీసుకెళ్తుండగా.. శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లు యాజమాని ఇంటి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని.. వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.